


**ఉనికి కోల్పోతున్న తెలుగుదేశం**

తెలుగుదేశం నాయకులు పార్టీని వీడుతుండ డంతో ఉనికి కోల్పోతోందని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు.

- 8లో



**ఉప్పొంగిన ఉద్యానం**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

- 8లో

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| చిత్తూరు | 35 | 25 |
| తిరుపతి | 36 | 26 |
| తిరుమల | 30 | 22 |
| గూడూరు | 36 | 23 |
| నగరి | 36 | 27 |

## న్యూస్‌రీల్

### నేడు మొక్కలు నాటే కార్యక్రమం

**చిత్తూరు కార్పొరేషన్ :** జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మహిళలతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారులతో సెక్షన్ల వారీగా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటిన మహిళల ఫొటోలు తీసుకోవాలని తెలిపారు. ఒక మహిళ ఎన్ని మొక్కలు అయినా నాటవచ్చని పరిమితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జెడ్పీ ప్రాంగణంలో మొక్కలు నాటేందుకు చేపడుతున్న కసరత్తును ఆయన పర్యవేక్షించారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తి డీఎల్‌డీవో ఆదిశేషారెడ్డి, ఎంపీడీవో బాలాజీ, జెడ్పీ ఏవోలు శ్రీనివాసులు, రమణప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు పాఠశాలలకు సెలవు

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్యాల పాఠశాలలకు శుక్రవారం ఐచ్ఛిక (ఆప్షనల్) సెలవు ప్రకటించినట్లు డీఈవో విజయేంద్రరావు, ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ హేమారెడ్డి తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ మొహ్రం పండుగను పురస్కరించుకుని ముస్లిం టీచర్ల విన్నపం మేరకు శుక్రవారం ఐచ్ఛిక సెలవు ఇచ్చినట్లు పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి కేటాయించిన ఐదు ఐచ్ఛిక సెలవులలో ఒకటి మొహరం పండుగకు ఇచ్చినట్లు తెలిపారు.

### పెండింగ్ కేసులపై సీరియస్



మాట్లాడుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

**చిత్తూరు అర్బన్:** 'దీర్ఘకాలికంగా స్టేషన్లలో కొలిక్కిరాని పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తి చేసేందుకు వచ్చిన సమస్య ఏమిటి..? ప్రతి సమావేశంలో దీనిపై అడుగుతున్నాను. వచ్చే మీటింగ్‌లోపు పెండింగ్ కేసులు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవు. రోడ్లపై మనం నిత్యం కనిపిస్తుండాలి. అప్పుడే తప్పుచేసే వాళ్లకు భయం ఉంటుంది. ట్రాఫిక్ ఓ పద్ధతి ప్రకారం వెళుతుంది..' అని ఎస్పీ వై.రిషాంత్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం ,ఎర్రచందనం, ఇసుక స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలన్నారు. ప్రతి గడపకు మహిళా పోలీస్ కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు చొరవ చూపించాలన్నారు. ను అడ్డుకోవాలని ఆదేశించారు. ఈనెలలో కేసుల పరిష్కారంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పోలీసులకు ఎస్పీ నగదు రివార్డులను అందచేశారు.

# పలకరిస్తూ.. భరోసా ఇస్తూ..

రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వార్డుబాట తొలిరోజు గురువారం పుంగనూరులో ప్రజల ఆత్మీయ స్వాగతాల నడుమ ఉత్సాహంగా సాగింది. ప్రతి ఒక్కరికీ ఆప్యాయంగా అభివాదం చేస్తూ.. పలకరిస్తూ ..వినతులు స్వీకరిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ భరోసా ఇచ్చారు. హనుమంతరాయుని దిన్నె, రామ్‌నగర్ కాలనీ, డిగ్రీ కళాశాల, రామసముద్రం రోడ్డు, బీడీ కాలనీ, ప్రభుత్వాస్పత్రి రోడ్డు, కట్టకిందపాళ్యెం ప్రాంతాల్లో వార్డుబాట నిర్వహించారు. పథకాల ద్వారా అందుకున్న లబ్ధిని లబ్ధిదారులతోనే మంత్రి చదివించారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- పుంగనూరులో ఉత్సాహంగా ప్రారంభమైన వార్డుబాట
- అడుగడుగునా మంత్రి పెద్దిరెడ్డికి ఆత్మీయ స్వాగతం
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం
- సమస్యలపై తక్షణ ఆదేశాలు

**పుంగనూరు:** మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వార్డు బాటకు జనం బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. మహిళలు మంగళ హారతులతో నీరాజనాలు పలికారు. మేళతాళాలతో, బాణసంచాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. మంత్రి పర్యటన ఈసారి కొత్తపంథాలో సాగింది. వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌ను వెంట పెట్టుకుని పర్యటన సాగించారు. ప్రజలు తమకు ఈ పథకం అందలేదని చెప్పిన వెంటనే, వలంటీర్ల ద్వారా మంజూరు ఉత్తర్వులు చూపిస్తూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన పథకాలు చూడండి...మీకు అందింది కదా ...అంటూ మంత్రి లబ్ధిదారులను చదవమని చెప్పడంతో మహిళలు సంతృప్తి చెందారు. మహిళలు సంతోషంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌ఎస్‌పేటలో కాలువలు ఏర్పాటు



మంత్రి పెద్దిరెడ్డికి హారతితో స్వాగతం పలుకుతున్న ముస్లిం మహిళ

చేయాలని కోరడంతో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి కాలువ పనులకు తక్షణం రూ.40 లక్షలు మంజూరు చేయించారు. వినతులను స్వీకరిస్తూ ఎప్పటికప్పుడు అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసి పరిష్కరించడంతో వార్డుబాట ప్రజల్లో నూతనోత్తేజాన్ని నింపింది. ఈ పర్యటనలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, ఎంఆర్‌సీరెడ్డి, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆర్‌వో ప్లాంటు ప్రారంభం**

పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రోగుల కోసం రూ.3 లక్షలతో నిర్మించిన ఆర్‌వో ప్లాంటును చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలిసి మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. రోగులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆస్పత్రి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్ పాల్గొన్నారు. అలాగే సుమారు రూ.1.20 కోట్లతో చేపట్టనున్న కాలువలు, రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి పాల్గొన్నారు.

**కారు నడిపిన మాజీ ఎమ్మెల్యే**

పుంగనూరు వార్డుబాటలో పర్యటిస్తున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కారును పుంగనూరు మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నడిపారు. ఉదయం నుంచి మంత్రి పర్యటనలో శ్రీధర్‌రెడ్డి పాల్గొని ఆయన కారును నడపడంతో రాజకీయ సమీకరణాలపై పెద్ద ఎత్తున చర్చ మొదలైంది.

**ఆలయానికి చేయూత..**

పుంగనూరు పట్టణంలోని ఎస్‌ఎస్‌పేటలో నిర్మిస్తున్న శ్రీఏకశిల ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి మంత్రి పెద్దిరెడ్డి చేయూతనిస్తామని తెలిపారు. ఆలయంలో ప్రతిష్ఠించనున్న సుమారు రూ.10 లక్షల విలువజేసే విగ్రహాన్ని మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ పరిశీలించి, పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# నేడు తిరుపతిలో ఉద్యోగ మేళా

**తిరుపతి ఎడ్యుకేషన్ :** తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఉప ఉపాధి కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఉప ఉపాధి అధికారి ఎస్.వెంకటరమణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేళాలో ఏజీటీఆర్‌ఎస్ ఐడార్ట్ సంస్థలో సీనియర్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ఉద్యోగానికి ఏదేని డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో విద్యార్హత 18 నుంచి 30 ఏళ్లలోపున్న పురుషులు అర్హులని తెలిపారు. అపోలో ఫార్మసీలో రీటైల్ ట్రైనీ, అసోసియేట్/ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు పది, ఇంటర్, డిప్లొమో, డిగ్రీ, ఎంఫార్మ్, బీఫార్మ్, డీఫార్మ్ విద్యార్హత, అలాగే కార్బన్ మొబైల్స్‌లో మొబైల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు పది, ఆపై విద్యార్హత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరవ్వాలని తెలిపారు. అభ్యర్థులు తమ వివరాలను 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్లో నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 97904 47005, 93922 75861నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

# ప్రజారోగ్యానికి పెద్దపీట

**పుత్తూరు రూరల్:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని, ఇందుకు రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తుండడమే నిదర్శనమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. రాష్ట్రంలో స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి 11 మెడికల్ కళాశాలలు మాత్రమే ఏర్పాటు చేయగా, వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తుండగా ఇందులో 5 మెడికల్ కళాశాలలు ఈ ఏడాదే ప్రారంభం కానున్నాయని చెప్పారు. గురువారం వడమాలపేట మండలం పూడి సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి అవినీతి రహిత పాలన అందిస్తున్నారని చెప్పారు. ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరిటే అమలు చేస్తున్న జగనన్నకు మహిళలపై ఉన్న ప్రత్యేక గౌరవాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. వలంటీర్లు, గృహ సారథులు, ఎమ్మెల్యేలు, మంత్రులు గడప గడపకు వచ్చి మీ యోగ క్షేమాలను తెలుసుకొని, సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. అనంతరం 468 మందికి వివిధ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్ కుసుమ, కార్పొరేషన్ల డైరెక్టర్లు రేణుక, యాదవేంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి రోజా

# పేద విద్యార్థులకు 'విదేశీ' వరం



జగనన్న విదేశీ విద్యాదీవెన మెగా చెక్కును తల్లిదండ్రులకు అందజేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

- కలెక్టరేట్‌లో జగనన్న విదేశీ విద్యాదీవెన జిల్లా స్థాయి కార్యక్రమం
- జిల్లాలో 13 మంది విద్యార్థులకు రూ.2.19 కోట్ల లబ్ధి
- హాజరైన కలెక్టర్ షణ్మోహన్, ప్రజాప్రతినిధులు

**చిత్తూరు కలెక్టరేట్ :** పేద విద్యార్థులు విదేశీ విద్య చదివేలా రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం జిల్లా కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేద విద్యార్థులు అత్యుత్తమ స్థాయిలో ఉండాలనే ఆకాంక్షతో అమలు చేస్తున్న జగనన్న విదేశీ విద్యాదీవెన వరమని తెలిపారు. ఫీజుల కోసం తల్లిదండ్రులు అప్పులు చేసే పరిస్థితులు తలెత్తకుండా ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తోందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఈ పథకంలో 13 మంది లబ్ధి పొందుతున్నారన్నారు. గత విద్యా సంవత్సరంలో 11 మంది చదువుల కోసం విదేశాలకు వెళ్లారని చెప్పారు. ఈ పథకం కింద ప్రభుత్వం రూ.2,19,82,841 విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు.

**రాజకీయాలకు అతీతంగా**

మేయర్ అముద మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పథకం లేదన్నారు. రాజకీయాలకతీతంగా ప్రభుత్వం విద్యార్థులకు అండగా ఉంటోందన్నారు. అనంతరం జగనన్న విదేశీ విద్యాదీవెన మెగా చెక్కును ఆవిష్కరించారు. అంతకు ముందు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభించిన జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రమాన్ని అధికారులు లైవ్‌లో వీక్షించారు. ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, బీసీ వెల్ఫేర్ డీడీ రబ్బానీబాషా, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, ఈడిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కేజే.శాంతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**మేలు మరవలేం..**



నా పేరు సుబ్రహ్మణ్యం. మాది గంగవరం మండలం ,కీళపట్ల. మా పాప చందన విదేశీ విద్యాదీవెనకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతం కజఖిస్తాన్‌లోని ఏ1 ఫరాబి కజఖ్ నేషనల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదువుతోంది. మా కుమార్తె అక్కడ చదువుతుందని మేము కలలో కూడా అనుకోలేదు. సీఎం చేస్తున్న మేలును ఎన్నటికీ మరువలేం.

– చందన తల్లిదండ్రులు

**రుణపడి ఉంటాం..**



నా పేరు మల్లికార్జున. చిత్తూరు ఓబనపల్లె. మా అమ్మాయి లిఖిత జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి ఎంపికై ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని మొనాష్ యూనివర్సిటీ మెల్‌బోర్న్‌లో డేటా సైన్స్ చదువుతోంది. ఇంత ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందజేయడం గొప్ప విషయం. సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– లిఖిత తల్లిదండ్రులు

**జర్మనీకి పంపిస్తామని అనుకోనేలేదు..**



నా పేరు దేవరాజు. చిత్తూరు రాంనగర్‌కాలనీ. బీటెక్ పూర్తి చేసిన మా అబ్బాయి హితేష్ జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి ఎంపికయ్యాడు. ప్రస్తుతం జర్మనీలో ప్రాసెసింగ్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ సిస్టమ్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. నా కుమారుడిని జర్మనీకి పంపిస్తానని ఎప్పుడూ అనుకోలేదు.

– హితేష్ తండ్రి దేవరాజు, చిత్తూరు

## కాణిపాకం బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

**కాణిపాకం(యాదమరి):** కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈసారి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. గురువారం దేవస్థానం సమావేశ మందిరంలో సెప్టెంబర్ 18 నుంచి జరుగునున్న బ్రహ్మోత్సవాలపై పాలక మండలి చైర్మన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు మురంశెట్టి రాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, సౌకర్యాలపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి, సామాన్య భక్తులకు పెద్దపీట వేసే చర్యలపై చర్చించారు. అనంతరం ఆలయ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు మరో 50 రోజులు ఉన్నందున ఇప్పటి నుంచే ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈఓ వెంకటేశు, అధికారులు పాల్గొన్నారు.

**1 నుంచి పనులు ప్రారంభం**

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆగస్టు ఒకటో తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. వారు విలేకరులతో మాట్లాడుతూ ఉభయదారులకు సమావేశం ఏర్పాటు చేసి సూచనలు తీసుకున్నామని పేర్కొన్నారు. పలు పనులకు టెండర్లు నిర్వహించామని పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో ప్రభుత్వ భూమి 18.60 ఏకరాలను జిల్లా కలెక్టర్ అప్పగించారని, ఆ స్థలంలో విగ్రహాలు, పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

## విరివిగా చాప్ కట్టర్ల పంపిణీ



చాప్ కట్టర్లు పంపిణీ చేస్తున్న జేడీ ప్రభాకర్

**తవణంపల్లె:** పాడి రైతులకు సబ్సిడీ ధరకు గడ్డి కత్తరించే యంత్రాలు(చాప్‌కట్టర్లు) విరివిగా పంపిణీ చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ ఎం. ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన కింద గురువారం తవణంపల్లెలో రైతులకు చాప్‌కట్టర్లను పంపిణీ చేశారు. జేడీ మాట్లాడుతూ చాప్ కట్టర్ ధర రూ. 33,970 కాగా, ప్రభుత్వం రూ.13,588 సబ్సిడీ ఇస్తుందన్నారు.







# వెన్నుపోటు పొడిస్తే తిరగబడతా!

**వెదురుకుప్పం:** పేదల అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న అభిమతమని, కులమతాలకతీతంగా పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. గురువారం మండలంలోని మొరవ గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'నా తల్లి సాక్షిగా చెబుతున్నా.. సీఎం జగనన్న భిక్షతో గెలిచిన నాయకులు వెన్నుపోటు పొడిస్తే అలాంటి వారిపై తిరగబడతా. జగనన్నకు మోసం చేసిన నాయకులు నామరూపాలు లేకుండా పోయారు. రెడ్డి సామాజిక వర్గం లేకుంటే గతంలో కాంగ్రెస్ పార్టీ ఉండేది కాదు. ఆదినారాయణరెడ్డి, అమరనాథరెడ్డితో పాటు మరికొందరు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు వెన్నుపోటుదారులతో చేతులు కలిపి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేశారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద ప్రజలకు న్యాయం జరుగుతుంటే చూసి ఓర్వలేక పోతున్నారు. ఈ ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలను అందిస్తోంది. జగనన్న పాలన చూసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా ఈ ప్రభుత్వాన్ని విశ్వసిస్తున్నారు. అభివృద్ధిని అడ్డుకునే చంద్రబాబు కేవలం కోటీశ్వరులకు కొమ్ముకాస్తూ పేదల పాలిట శాపంగా మారారు. గతంలో చంద్రబాబు ఏఒక్క పథకం కూడా అమలు చేయలేదు. పేదల సంక్షేమం పట్టని రామోజీ, రాధాకృష్ణ నిత్యం ప్రభుత్వంపై పనిగట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు. చంద్రబాబు ప్రజల్లో ఏముఖం పెట్టుకుని తిరుగుతారో చెప్పాలి. ఆయన దత్తపుత్రుడి పరిస్థితి పిచ్చోడి చేతిలో రాయిగా మారింది' అని నారాయణస్వామి విమర్శించారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

## క్లుప్తంగా

### కుప్పం ఎస్‌ఐ శివకుమార్‌కు బహుమతి



బహుమతి అందుకుంటున్న ఎస్‌ఐ శివకుమార్

కుప్పంరూరల్: కుప్పం ఎస్‌ఐ శివకుమార్ గురువారం ఎస్పీ రిషాంత్ రెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతి పొందినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ చేతుల మీదుగా ఈ బహుమతి అందుకున్నారు. కుప్పం మండల పరిధిలో 15 దొంగతనాల కేసులు ఛేధించినందుకు ఎస్‌ఐ శివకుమార్, కానిస్టేబుల్ శంకర్‌కు ఎస్పీ నగదు బహుమతి అందజేశారని చెప్పారు.

### తొమ్మిది ఇసుక ట్రాక్టర్ల సీజ్



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇసుక ట్రాక్టర్

నగరి : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న తొమ్మిది ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి గురువారం సీజ్ చేశారు. మైన్స్ అధికారులకు సమాచారం అందించి ట్రాక్టరుకు రూ.5 వేలు జరిమానా విధించారు. మరో మారు ఇసుక తరలిస్తే జరిమానాలతో పాటు కేసు నమోదు చేస్తామంటూ ట్రాక్టర్ యజమానులను హెచ్చరించారు.





▶▶ పలమనేరు నియోజకవర్గం, గంగవరం మండలం, మారేడుపల్లికి చెందిన రవికుమార్‌కు మూడు ఎకరాల పొలం ఉంది. మొదటి నుంచి వివిధ రకాల పంటలు సాగుచేశారు. అయినా ఫలితంలేదు. పదేళ్లుగా ఇదే పరిస్థితి. నాలుగు నెలల క్రితం టమాట సాగువైపు మొగ్గు చూపారు. నాటి నెలన్నర నుంచి పంట దిగుబడి చేతికొచ్చింది. అప్పటి నుంచి కిలో రూ.60కిపైగా పలుకుతుండడంతో సంబరపడ్డాడు. ఆపై రేటు అమాంతంగా పెరగడంతో అతని సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. కిలో టమాట రూ.100 నుంచి రూ.120 వరకు విక్రయించాడు. మొత్తం రూ.48 లక్షల వరకు ఆదాయం వచ్చింది. గతంలో ఎప్పుడూ ఇంత ఆదాయం చూడలేదని, ఇప్పటిదాకా ఉన్న అప్పులు తీర్చేశానని చెబుతున్నాడు.



▶▶ శ్రీకాళహస్తి మండలం, టీఎంవీ కండ్రిగకు చెందిన సుబ్రమణ్యంరెడ్డి గతంలో క్రమం తప్పకుండా వరి సాగు చేసేవారు. తెగుళ్లు, మందులతో విసిగిపోయేవారు. పెట్టుబడి కూడా వచ్చేది కాదు. దిగుబడి వచ్చినా సరైన గిట్టుబాటు ధర లేక తీవ్ర నష్టాలు ఎదుర్కొనేవారు. ప్రతి ఏడాదీ ఇదే పరిస్థితి. మూడు నెలల నుంచి కూరగాయల ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఆ వైపు మొగ్గుచూపారు. నెల్లూరు నుంచి బ్రాండెడ్ బెండ గింజలు, గోరు చిక్కుళ్లు, కాకరకాయ గింజలు తెచ్చి 40 సెంట్లలో సాగుచేశారు. నెలకంతా కోతకొచ్చాయి. కిలో రూ.50 లెక్కన హోల్‌సేల్‌గా విక్రయించడం ప్రారంభించారు. సుమారు రూ.4 లక్షలకుపైగా ఆదాయం గడించారు. ప్రస్తుతం బెండ రేటు తగ్గిందని, గోరు చిక్కుళ్లు కిలో రూ.60 వరకు పలుకుతున్నాయని తెలిపారు. వరి, వేరుశనగ, చెరుకు కన్నా కూరగాయల సాగు మేలని, ఎంత కష్టపడితే అంత ఆదాయం పొందవచ్చని అంటున్నారు.

- ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపుతున్న రైతాంగం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెరిగిన సాగువిస్తీర్ణం
- టమాటతో అధిక ఆదాయం
- కూరగాయలతో ఆశించిన ఫలితం
- ఆరోగ్యం దృష్ట్యా పెరిగిన వినియోగం
- కలిసివస్తున్న ప్రభుత్వ రాయితీ

# ఉప్పొంగిన ఉద్యానం!

.. ఇలా ఆలోచిస్తోంది రైతులు రవికుమార్, సుబ్రమణ్యంరెడ్డే కాదు.. ప్రతి రైతూ ఆ దిశగానే అడుగులు వేస్తున్నారు. ఉద్యాన పంటల వైపే మొగ్గు చూపుతున్నారు. కొంతకాలంగా కూరగాయల ధరలు నిలకడగా ఉండడంతో ఆశించిన స్థాయిలో ఆదాయం పొందుతున్నారు. సాధారణ పంటలకు స్వస్తి చెప్పి ఉద్యాన పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. కష్టం తక్కువ..ఫలితం ఎక్కువని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 75 శాతం మంది వ్యవసాయాధారంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. తమకున్న పొలంలో వరి, వేరుశనగ, చెరుకు, మామాడితోపాటు ఇతర ఉద్యాన పంటలు సాగుచేస్తుంటారు. తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లో ఎక్కువగా వరి సాగుచేస్తుండగా.. చిత్తూరు జిల్లాలో అధికంగా ఉద్యానపంటలైన టమాట, చెరుకు, ఇతర కూరగాయల పంటలు సాగుచేస్తుంటారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెన్నై, బెంగళూరు మహానగరాలు సమీపంలోనే ఉండడంతో కూరగాయలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. రైతులు తమ పంటను ఆయా ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. ఈ క్రమంలో ప్రతి ఏటా ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది.


### ఆహారాన్ని మార్చేసిన కరోనా

కరోనా నుంచి కోలుకున్న తర్వాత ప్రజలు ఆహార అలవాట్లు మార్చుకున్నారు. ఆరోగ్యవంతమైన ఆహారం కోసం అన్వేషణ ప్రారంభించారు. దీని కోసం సంపాదనలో సగం వరకు ఖర్చు చేయడానికి కూడా వెనుకాడడంలేదు. ఇందులో ఎక్కువ శాతం మంది శాఖాహారాన్నే ఇష్టపడుతున్నారు. వివిధ రకాల కూరగాయాలతో కూడిన భోజనాన్ని తీసుకుంటున్నారు. ఫలితంగా గత రెండేళ్లుగా కూరగాయాల వినియోగం అనూహ్యంగా పెరిగింది. మార్కెట్లో కూరగాయాలకు డిమాండ్ ఏర్పడింది. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం అంతకంతకూ పెరుగుతోంది. వరి, వేరుశనగ, చెరుకు సాగు చేసే రైతులు ఉన్న పొలంలో కొంత ఉద్యాన పంటల సాగుకు కేటాయిస్తున్నారు. అందుకు నిదర్శనం ప్రస్తుతం సాగు విస్తీర్ణమే. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మామిడి మినహా 23,091 హెక్టార్లలో వివిధ రకాల కూరగాయల పంటలు సాగుచేయడమే.

### కూరగాయలకు భలే డిమాండ్

గత నాలుగు నెలల నుంచి కూరగాయల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఏది ఎత్తుకున్నా కిలో రూ.80కిపైగా పలుకుతోంది. గతంలో రైతులు హోల్‌సేల్‌గా మార్కెట్‌కు తరలించేవారు. అయితే ఇటీవల ఆశించిన స్థాయిలో ధరలు ఉండడం.. వ్యాపారులు ఒకటికి సగానికి అడుగుతుండడంతో రైతులే వ్యాపారులుగా మారుతున్నారు. ఆయా ప్రాంతాల్లో వారపు సంతల్లో కూరగాయలు విక్రయిస్తూ అధిర రాబడి పొందుతున్నారు.





**ఉమ్మడి జిల్లా సమాచారం**

సాధారణ సాగు విస్తీర్ణం 1,56 లక్షల హెక్టార్లు

| | | | | |
|---|---|---|---|---|
| ఆకుకూరల 342 | క్యాబేజీ 116 | టమాట 5,030 | మిరప 928 | వంగ 350 |
| క్యాలీఫ్లవర్ 171 | పొటాటో 368 | బెండ 260 | బీన్స్ 614 | కాకర 310 |
| క్యాప్సికమ్ 38 | | ఉల్లిగడ్డ 450 | సొర 150 | బీర 170 |

### జాక్‌పాట్ కొట్టిన టమాట రైతు

ఇటీవల కాలంలో టమాటకు భారీ డిమాండ్ ఏర్పడింది. కర్ణాటక, చెన్నై, ఉత్తర భారతదేశంలోని కొన్ని నగరాల్లో టమాట ఉత్పత్తి తగ్గడం ఇక్కడి రైతులకు కలిసివచ్చింది. అక్కడి వ్యాపారుల రాక పెరిగింది. గతంలో నష్టాలు రావడం.. తెగుళ్ల బెడదతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గడం కూడా టమాట రైతుకు అనుకూలంగా మారింది. నాలుగు నెలల నుంచి కిలో రూ.60కిపైగా పలుకుతోంది. గత నెలన్నర నుంచి కిలో రూ.100పైమాటే. కొందరు రైతులు లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు ఆర్జించారంటే అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలో సాధారణ పంటల స్థానంలో టమాట విత్తేందుకు ఆసక్తి చూపుతున్నారు. పలమనేరు, గంగవరం, కుప్పం, నగరి, చిత్తూరు, పుంగనూరు, సోమల, సదుం, చంద్రగిరి మండలాల్లో ఎక్కువగా టమాట సాగుచేస్తున్నారు. ఇటీవల కిలో చికెన్ రూ.200 పలకగా.. అదే స్థాయిలో టమాట ధర పలకడం గమనార్హం.

### కూరగాయల తోటతో లాభాలు



నాకు మూడెకరాల పొలం ఉంది. గత ఏడాది వరకు సగం పొలంలో వరి, మరో సగం పొలంలో వేరుశనగ సాగుచేసేవాడిని. ఆ పంటలు సాగుకు ఖర్చు ఎక్కువ.. దిగుబడి తక్కువ. ఇప్పుడు ఆ మూడెకరాల్లో ఎకరం బెండ, ఎకరం గోరుచిక్కుడు, మరో ఎకరం పొలంలో బీర సాగుచుశా. పెట్టుబడి తగ్గడంతోపాటు అధిక లాభాలు వస్తున్నాయి. రోజూ 400 కిలోల కూరగాయలు దిగుబడి వస్తున్నాయి. కిలో బెండ రూ.50 చొప్పున విక్రయిస్తున్నాను. కేవలం బెండలోనే రోజూ రూ.20 వేలు చేతికొస్తోంది. ఇదే మాదిరిగా గోరుచిక్కుడు, బీర సైతం మంచి దిగుబడి వస్తోంది.

– మునిరత్నం నాయుడు, కోనప్పగుంట గ్రామం, పుత్తూరు మండలం

### వంగకు వందనం



మాకు ఊర్లో నాలుగెకరాల పొలం ఉంది. అందులో వరి సాగుచేస్తున్నాను. ఖర్చు ఎక్కువ, లాభాలు తక్కువగా ఉండడంతో పక్కనే ఉన్న తిప్పవరప్పాడులో రెండెకరాలు కౌలుకు తీసుకున్నాను. ఒకటిన్నర ఎకరంలో వంగ సాగు ఆరంభించాను. రూ.2 లక్షలకుపైగా పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం రోజూ సుమారు 700 నుంచి 800 కిలోల వంగ దిగుబడి వస్తోంది. కిలో రూ.60 నుంచి రూ.70కి విక్రయిస్తున్నాను. కూలీలు, పురుగు మందులకు పోను చేతి నిండా డబ్బులు చూస్తున్నాను. వరి సాగుకంటే.. వంగ సాగుతో మంచి లాభాలు గడిస్తున్నాను.

– నీలకంఠయ్య, చంబడిపాలెం, గూడూరు రూరల్ మండలం,

### సాగు విస్తీర్ణం పెరుగుతోంది



ప్రస్తుతం రైతులు ఎక్కువగా ఉద్యాన పంటల సాగుపై మక్కువ చూపుతున్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోంది. పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటోంది. పండించిన పంటను రైతులే విక్రయించేందుకు ప్రోత్సహిస్తున్నాం. షెడ్లు, దుకాణాలు, మిషనరీల కోసం 40 శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాలు అందిస్తున్నాం. రైతులకు అవసరమైన మొక్కలు కూడా అందిస్తున్నాం.

– దశరథరామిరెడ్డి, ఉద్యానశాఖ జిల్లా అధికారి



# ఉనికి కోల్పోతున్న తెలుగుదేశం



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ మైనారిటీ నేతలు

పుంగనూరు: టీడీపీ నేతలు భారీగా వైఎస్సార్ సీపీలో చేరుతుండడంతో ఆపార్టీ ఉనికి కోల్పోతోందని రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం మంత్రి పెద్దిరెడ్డి వార్డుబాట సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఎంఎం.సాధిక్ ఆధ్వర్యంలో తెలుగుదేశం ముస్లిం మైనార్టీలు 20 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఖలీల్, అబ్దుల్‌రజాక్, అంజాద్, ఇర్ఫాన్, షౌఖత్, రషీద్, ఖాదర్, ఖలీల్ ఖాన్, జహీర్, సైపుల్లా, బాబుల్లి, అక్బర్, నయాజ్‌తో పాటు హసీనా, రేష్మా, నూర్‌షా తదితరులకు మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంఆర్‌సీ రెడ్డి, జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా పాల్గొన్నారు.

**శాంతిపురం టీడీపీ నాయకులు**

రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం బోయనపల్లెకు చెందిన తెలుగుదేశం పార్టీ మండల యువత మాజీ అధ్యక్షుడు కేశవులు, గడ్డూరుకు చెందిన తెలుగుదేశం నాయకుడు రమేష్ గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వీరికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై తెలుగుదేశం నాయకులు వైఎస్సార్ సీపీలో చేరడం హర్షణీయమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్ కూడా కరువవుతుందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారు వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, కోదండరెడ్డి, ఏవీ.జయరాం, విజయకుమార్, జగన్ పాల్గొన్నారు.

### దాడిలో గాయపడిన గర్భిణి ప్రసవం

– ఆస్పత్రిలో తల్లీబిడ్డ మృతి



మృతి చెందిన సత్యవాణి (ఫైల్)

నింద్ర: మండలంలోని కొప్పేడు దళితవాడలో భూతగాదాలో గాయపడిన నిండు గర్భిణి సత్యవాణి(20) బిడ్డను ప్రసవించి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో గురువారం ఉదయం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు .. ఈనెల 9 తేదీన ఆదివారం కొప్పేడు దళితవాడ పొలాల్లో మధుబాబు కుటుంబసభ్యులు, సత్యవాణి కుటుంబసభ్యుల మధ్య ఘర్షణ జరిగింది. మధుబాబు వర్గీయులు జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడిన గర్భిణి సత్యవాణిని చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె ప్రసవించగా బిడ్డ మృతి చెందింది. అనంతరం వైద్యం పొందుతూ ఆమె కూడా మృతి చెందింది. ఘర్షణ జరిగిన రోజున సత్యవాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. సత్యవాణి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

# జగనన్న అందరి దేవుడన్నా..



జగనన్న దేవుడు సార్ అని ఎమ్మెల్యేకు చెబుతున్న మహిళ

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలో ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో లబ్ధిదారులు తమకు పథకాలు ఇంటి ముంగిటే అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఒక మహిళను అమ్మా ..జగనన్న ఎవరమ్మ..? తెలుసా అంటూ ఎమ్మెల్యే ప్రశ్నించారు. 'సార్ ఆయన దేవుడు సార్.. మేము పథకాలు కావాలని ఎవ్వరి దగ్గరకు పోలేదు.. మాకు అన్ని పథకాలు వస్తున్నాయి.. ఇదంతా జగనన్న ముఖ్య మంత్రిగా ఉండడంతోనే కదా.. అందుకే ఆయన దేవుడు' అని చెప్పంది. ఎమ్మెల్యే ఆమెను అభినందించారు.

### శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 74,268 మంది స్వామివారిని దర్శించుకోగా.. 26,817 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.32 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీజేఎస్ఎం పాఠశాల క్రీడా మైదానంలో గురువారం ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన బాలికల విభాగం నుంచి 20 మంది, బాలుర విభాగం నుంచి మరో 20 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీ.సుధాకర్, ఏ.రెడ్డెప్ప తెలిపారు.

# రాయల సీమ ద్రోహి చంద్రబాబే

- ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత లేదు
- మంత్రి ఆర్కే రోజా



నగరి : రాయలసీమ ద్రోహి చంద్రబాబే అని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాయలసీమ ద్రోహి అంటూ చంద్రబాబు విమర్శలు చేయడంపై ఆమె మండిపడ్డారు. 14 ఏళ్ల సీఎంగా ఉండి రాయలసీమకు ఏమి చేశారని చంద్రబాబును ప్రశ్నించారు. ఏపీలో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల్లో ఒక్కటైనా తాను పూర్తి చేశానని ఆయన చెప్పగలరా అని అన్నారు. దివంగతం సీఎం వైఎస్సార్ ప్రారంభించిన పోలవరాన్ని 2018 లోనే పూర్తి చేస్తానన్న చంద్రబాబు ఎందుకు పూర్తి చేయలేదని దుయ్యబట్టారు. పోలవరం నిర్మాణ పనుల్లో డయాఫ్రమ్ వాల్ నిర్మాణంలో కూడా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. డబ్బులు కోసం పోలవరాన్ని ఒక ఏటీఎంలా వాడుతున్నారని సాక్షాత్తు ప్రధాన మంత్రి మోడీనే చంద్రబాబును ఉద్దేశించి చెప్పడం మరిచిపోయారా అని ప్రశ్నించారు. రాయల సీమలోని ప్రాజెక్టులను తన ఐదేళ్ల పరిపాలనలో ఆయన ఎందుకు పూర్తి చేయలేక పోయారన్నారు. వ్యవసాయం దండగ అని నిర్మాణ పనుల్లో ఉన్న ప్రాజెక్టులు అన్నింటినీ నిలిపివేసిన ఘనత చంద్రబాబుదని ఆరోపించారు. ఆయన రాష్ట్రానికి కాదు సొంత జిల్లా చిత్తూరు కూడా ఏమీ చేయలేదని ప్రజలందరికీ తెలుసు అంటూ ఎద్దేవా చేశారు. ఆయనకు అల్జీమరస్ వచ్చిందని, అందుకే ఏవేవో మాట్లాడుతున్నారని విమర్శించారు. పోలవరాన్ని, హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులతో పాటు రాయలసీమకు గుండెకాయలాంటి గండికోట ప్రాజెక్టును పూర్తి చేసి రాయలసీమ ప్రజలకు అంకితం చేసేది సీఎం జగనన్నే అని స్పష్టం చేశారు. నెల్లూరులో సోమశిల ప్రాజెక్టును పూర్తి చేసి హంద్రీ-నీవా ప్రాజెక్టు సామర్థ్యాన్ని కూడా పెంచనున్నారన్నారు. చంద్రబాబు ఆరోపణలను ప్రజలు నమ్మడం లేదని మంత్రి రోజా తెలిపారు.

# మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన సంతోష్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లెకు చెందిన పి.సంతోష్ (24) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. కొంగారెడ్డిపల్లెలోని పాత భజనగుడి వీధికి చెందిన పళణి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారు. పళణి కుమారుడు సంతోష్ కూడా ఆటో నడుపుతున్నాడు. చెడుస్నేహం చేస్తూ దారితప్పుతున్న సంతోష్‌ను బుధవారం రాత్రి తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన సంతోష్ గురువారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో పైకప్పుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.